telangana chowrasta.com
epaper.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:306

24 క్యారెట్లు 1,54,950.00 | కిలో వెండి 2,55,000.00 | CHOWRASTHA DIGITALS | 29.05.2026 శుక్రవారం, హైదరాబాద్

## ప్రధాని కార్యాలయం పర్యవేక్షణలో నీట్ రీటెస్ట్



- రీటెస్ట్ ప్రక్రియను నిశితంగా పరిశీలన
- లోపాలు తలెత్తకుండా కేంద్రం పటిష్ట చర్యలు
- జూన్ 21న నీట్ రీ-టెస్ట్
- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

2



## డీకే శివకుమార్‌కు లైన్ క్లియర్..?

- సీఎం సిద్ధరామయ్య రాజీనామా
- ఎందుకు చేశారో చెప్పని కాంగ్రెస్ అధిష్టానం...
- అందుబాటులో లేని గవర్నర్
- కార్యదర్శికి రాజీనామా లేఖ అందజేత
- జాతీయ స్థాయి రాజకీయాలపై ఆసక్తి లేదు
- రిటైర్మెంట్ తీసుకోను..సీఎం సిద్ధరామయ్య

కర్నాటకలో కాంగ్రెస్ మార్క్ రాజకీయం మొదలైంది. పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఉన్నా, ఐదేండ్లు ఒకే వ్యక్తిని ముఖ్యమంత్రి సీట్లో కొనసాగించలేని నిస్సహాయస్థితిలో ఆపార్టీ నాయకత్వం ఉంది. దీనికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామానే ప్రత్యక్ష సాక్ష్యం. ఆయన స్థానంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను సీఎం చేస్తారని ప్రచారం జరుగుతుంది. అసలు సిద్ధ రామయ్యతో ఎందుకు రాజీనామా చేయించారు అనే విషయంపై కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటి వరకు నోరువిప్పలేదు. ఇలాంటి చర్యల వల్లే ఫాసిస్టు పార్టీలకు ఆయుధాలు ఇచ్చినట్టు అవుతున్నదని కాంగ్రెస్ కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. గురువారం మధ్యాహ్నం కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి లోక్‌భవన్‌కు వెళ్లారు.

-తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:** కర్నాటకలో కాంగ్రెస్ మార్క్ రాజకీయం మొదలైంది. పార్టీకి సంపూర్ణ మెజార్టీ ఉన్నా, ఐదేండ్లు ఒకే వ్యక్తిని ముఖ్యమంత్రి సీట్లో కొనసాగించలేని నిస్సహాయస్థితి లో ఆపార్టీ నాయకత్వం ఉంది. దీనికి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామానే ప్రత్యక్ష సాక్ష్యం. ఆయన స్థానంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను సీఎం చేస్తారని ప్రచారం జరుగుతుంది. అసలు సిద్ధ రామయ్యతో ఎందుకు రాజీనామా చేయించారు అనే విషయంపై కాంగ్రెస్ అధిష్టానం ఇప్పటి వరకు నోరు విప్పలేదు. ఇలాంటి చర్యల వల్లే ఫాసిస్టు పార్టీలకు ఆయుధాలు ఇచ్చినట్టు అవుతున్నదని కాంగ్రెస్ కార్య కర్తల్లో చర్చ జరుగుతోంది. గురువారం మధ్యాహ్నం కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఉప ముఖ్యమం త్రి డీకే శివకుమార్‌తో కలిసి లోక్‌భవన్‌కు వెళ్లారు. ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబా టులో లేకపోవడంతో గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ ను అందజేశారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. గవర్నర్ బెంగళూ రుకు తిరిగి వచ్చిన తర్వాత రాజీనామాపై అధికారిక నిర్ణయం తీసుకోనున్న ట్లు లోక్‌భవన్ వర్గాలు

..మిగతా 2 లో





## దేశం గర్వించదగ్గ గొప్ప నేత ఎన్టీఆర్

**ఆయన రాజకీయాలకు అతీతమైన శక్తి**

అంబేద్కర్, ఇందిరమ్మతో పాటు స్మరించుకోవాల్సిన 'జాతిరత్నం' ఎన్టీఆర్

ఎందరో మేటి నాయకులను అందించారు

విమర్శలు పట్టించుకోను.. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే 'ప్రజా పాలన'

30 వేల ఎకరాల్లో 'భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణం

అమీర్‌పేటలో విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

2


తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కేవలం ఒక పార్టీకో, వర్గానికో పరిమితమైన వ్యక్తి కాదని, దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. దేశ చరిత్ర నుంచి ఎవరిని స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు జాతి రత్నాలను తలచుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రీవనం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం సీఎం ఆవిష్కరించారు. అనంతరం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

-తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో

## హైదరాబాద్ రాయదుర్గం రియల్ సంచలనం

- ఎకరం రూ.237 కోట్లు.. దేశంలోనే కొత్త రికార్డు
- గతేడాది అక్టోబర్‌లో ఇదే ప్రాంతంలో ఎకరం రూ.177 కోట్లు
- కొద్దినెలలోనే భారీగా పెరిగిన ధర
- హైదరాబాద్ రియల్ ఎస్టేట్ బూమ్
- అగ్రరాజ్యం అమెరికాతో పోటీ పడుతోందంటూ చర్చ

2







## కాంగ్రెస్ కార్మికులను మోసం చేసింది

- మినిమం వేజెస్ ఫిక్స్ అంటూనే కార్మికులకు అన్యాయం
- త్వరలో తెలంగాణలో విప్లవాత్మక మార్పుల ప్రణాళిక
- టిఆర్ఎస్ ఆవిర్భావం సమసమాజ స్థాపన కోసం
- టీఆర్ఎస్ లో చేరిన మాజీ మంత్రి బోడ జనార్ధన్
- తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా మారుతాం
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అదినేత కవిత

2

సింగరేణి, ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ మోసం చేసిందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ కు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్థన్, అనుచరులతో కలిసి తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి కవిత సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ కార్మిక శాఖ మంత్రిగా, ఆర్టీసీ చైర్మెన్ గా పని చేసిన జనార్ధన్ చేరికతో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనకు పార్టీలో ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

–తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో



## డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాం

- ఒక్కో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. 7 ఇందిరమ్మ ఇండ్లకు సమానం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- 20 లక్షల ఇళ్లు నిర్మించాకే ఓట్లు అడుగుతాం
- గ్రేటర్ హైదరాబాద్లో ఇళ్ల కోసం స్థలాల పరిశీలన
- మంత్రులు పొన్నం, అజారుద్దీన్, ఎమ్మెల్యే నాయిని
- తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాం
- పేదల సొంతింటి కలను సాకారం చేశాం
- కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే తమ మేనిఫెస్టో అమలు చేయాలి

4

## విలీనం తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



- వేం నరేందర్‌రెడ్డికి ఆర్టీసీ జేఏసీ వినతి
- సర్కారు మాట మార్చడంపై అభ్యంతరం
- జూన్ రెండున అపాయింటెడ్ డేట్‌గా ప్రకటించాలి
- ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుంది
- రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి

2

## త్వరలో మున్సిపల్ ఎన్నికలు

- జనగణనకు, ఎన్నికలకు సంబంధం లేదు
- ఎప్పుడైనా మూడు కార్పొరేషన్లకు ఎన్నికలు
- కసరత్తు ప్రారంభించిన అధికారులు
- ప్రజాక్షేత్రంలోకి రాజకీయ పార్టీలు

2

# విలీనం తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం తర్వాతే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఆర్టీసీ జేఏసీ విజ్ఞప్తి చేసింది. జూన్ రెండున అపాయింటెడ్ డేట్ గా ప్రకటించాలని కోరింది. ఈమేరకు శుక్రవారం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యం లో ముఖ్యమంత్రి రాజకీయ ప్రధాన సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించింది. ఆయన నివాసంలో కలిసిన జేఏసీ నాయకులు గతంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై చర్చల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు, నిర్ణయాలను జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మెన్ ఎం థామస్ రెడ్డి, కో కన్వీనర్ బి యాదగిరి, వి. బాబు, ఎన్ బుద్ధ విశాల్, జి రవికిరణ్ వివరించారు. గుర్తింపు సంఘం ఎన్నికల కంటే ముందుగా జూన్ రెండో తేదీన విలీనానికి అపాయింటెడ్ డేట్ గా ప్రభుత్వం ప్రకటించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. విలీనంపై పలు అంశాలను వినతిపత్రంలో పేర్కొన్నారు ఈ సందర్భంగా జేఏసీ నాయకులను ఉద్దేశించి వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుందని స్పష్టత ఇచ్చారు. అలాగే జూన్ రెండో తేదీన అపాయింటెడ్ డేట్ ప్రకటన గురించి, విలీన విధి విధానాలకోసం అధికారులు, కార్మిక సంఘాలతో కమిటీ వేసి, విలీనం సక్రమంగా చేసేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఆంధ్రాలో ఆర్టీసీ ఉద్యోగులకు జరిగిన నష్టం తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు జరగకుండా కార్మిక సంఘాలు, అధికారులు , తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే విలీనంతో ఆర్టీసీ కార్మికులకు మేలు చేయాలని సీఎం భావిస్తున్నారని చెప్పారు. విలీనం సక్రమంగా, సజావుగా జరగడానికి నావంతు ప్రయత్నం చేస్తానని నరేందర్‌రెడ్డి భరోసా ఇచ్చినట్టు జేఏసీ ఒక ప్రకటనలో తెలియజేసింది.

# దేశం గర్వించదగ్గ గొప్ప నేత ఎన్టీఆర్



**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కేవలం ఒక పార్టీకో, వర్గానికో పరిమితమైన వ్యక్తి కాదని, దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. దేశ చరిత్ర నుంచి ఎవరిని స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు జాతి రత్నాలను తలచుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట మైత్రీవనం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం సీఎం ఆవిష్కరించారు. అనంతరం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

**ముగ్గురు 'జాతిరత్నాల' స్ఫూర్తితో ముందుకు..**

దేశ చరిత్రను తిరగరాసిన ముగ్గురు గొప్ప నేతలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సీఎం సూచించారు. రాజ్యాంగం ద్వారా పేదలకు ఓటు హక్కు కల్పించిన అంబేద్కర్, భూసంస్కరణలతో పేదలకు భూమిపై హక్కు కల్పించిన ఇందిరా గాంధీ, నీతి – నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచిన ఎన్టీఆర్.. ఈ ముగ్గురూ మానవ మనుగడ ఉన్నంత కాలం స్మరించుకోవాల్సిన 'జాతిరత్నాలు' అని చెప్పారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయి ఉండి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంపై వస్తున్న విమర్శలను రేవంత్ రెడ్డి తిప్పికొట్టారు. 'ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నాకు జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకం. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ఆయన ఒక మహాశక్తి. ఆనాడు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి వంటి నేతలను దేశానికి అందిస్తే.. తుమ్మల నాగేశ్వరరావు, మహేందర్ రెడ్డి, కడియం శ్రీహరి వంటి వారితోపాటు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూడా ఎన్టీఆర్ గుర్తించి మంచి నాయకులుగా తీర్చిదిద్దారు' అని అన్నారు.

నేటి ప్రభుత్వ పథకాల వెనుక ఎన్టీఆర్ ఆలోచనలు ఉన్నాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'మేము అమలు చేస్తున్న సన్నబియ్యం పథకానికి ఎన్టీఆర్ తెచ్చిన రూ. 2 కిలో బియ్యం పథకమే పునాది. ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు వంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్న ఘనత ఆయనది. రాజీవ్ గాంధీ తెచ్చిన రిజర్వేషన్లను అమలు చేసి బలహీన వర్గాలను పాలకులుగా మార్చిన ప్రజాస్వామ్యవాది ఎన్టీఆర్' అని సీఎం కొనియాడారు.


హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెడతామని సీఎం చెప్పారు. తాము 30 వేల ఎకరాల్లో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తామన్నారు. ప్రపంచ దిగ్గజ కంపెనీలను ఇక్కడికి రప్పించి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. 2034 వరకు ప్రజా ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, సినీ, రాజకీయ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.



# త్వరలో మున్సిపల్ ఎన్నికలు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

జనగణన జరుగుతున్న సమయంలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయా? జనాభా లెక్కలు పూర్తయ్యేవరకు ఎన్నికలను ఆపాల్సిందేనా? అన్న చర్చకు తెరపడింది. మున్సిపల్ ఎన్నికలకు, జనగణనకు ఎలాంటి సంబంధం లేదని అధికారులు తేల్చేశారు. దీనితో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడైనా జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను విభజించడంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడ్డాయి. దీంతో పాటు ఖమ్మం, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్లు, మునగనూరు, మందమర్రి, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. జనాభా లెక్కల ప్రక్రియతో హైదరాబాద్‌లోని మూడు కొత్త కార్పొరేషన్ల ప్రక్రియతో ఎన్నికలు ఆగిపోతాయనే చర్చ జరిగింది. అయితే జనాభా లెక్కలకు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదని అధికారులు తేల్చారు. వీటి గడువు ముగిసి దాదాపు నాలుగు నెలలైంది. పాలకవర్గాలు లేకపోవడంతో మున్సిపాల్టీలు ప్రస్తుతం ప్రత్యేక పాలనాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ విధానం ఇలాగే కొనసాగితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోతున్నాయి. అంతేకాకుండా మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించి ఆ తర్వాత కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాల్సివుంది.దీని ద్వారానే మున్సిపాల్టీల అభివృద్ధి కోసం కేంద్రంతో సంప్రదింపులు చేయాల్సి ఉంటుంది. ఆయా మున్సిపాల్టీల పనితీరు ఆధారంగా కేంద్రం నుంచి గ్రాంట్లు వస్తాయి. ఆర్థిక నిర్వహణ విషయంలో కేంద్రం నిబంధనలను అమలు చేయడం తప్పనిసరి. అప్పుడే మున్సిపాల్టీలకు గ్రాంట్లు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. కేంద్రం జనాభా లెక్కల నోటిఫికేషన్ కంటే ముందుగానే రాష్ట్రప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించడం, సరిహద్దులు గుర్తించడం, ప్రత్యేక అధికారులను నియమించడం, సిబ్బందిని నియమించడం లాంటి చర్యలు తీసుకుంది. దీనితో మున్సిపల్ ఎన్నికలకు ఎలాంటి ఢోకా లేదని అధికారులు చెబుతున్నారు. జనాభా లెక్కలు మే, 2027 వరకు కొనసాగనున్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విభజించడం, ఎన్నికలకు నిర్వహించడం సరైందికాదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిబంధనల ప్రకారం మున్సిపల్ శాఖ అధికారులకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నియోజకవర్గాల వారీగా కార్యకర్తలను సన్నద్ధం చేస్తున్నది. ప్రజలకు కొన్ని వాగ్దానాలు కూడా చేస్తున్నది. ఆ తర్వాత హైదరాబాద్ పార్లమెంటు పరిధిలో బలంగా ఉన్న ఎంఐఎం నాయకులు బస్తీల్లో తిరుగుతూ ప్రజలను కలుస్తున్నారు.ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా తన ఎంపీ ల్యాండ్స్ నిధులు ఇచ్చిన చోట పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ గత ఎన్నికల్లో ఇద్దరు కార్పొరేటర్లకు పరిమితమైన అధికార కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తన బలాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. కంటోన్మెంట్ , జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో నాయకులు రెట్టింపు ఉత్సాహంతో ఉన్నారు. ఎలాగైనా గ్రేటర్ హైదరాబాద్‌ను కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతున్నది. ఈ ఎన్నికల కోసం గాంధీభవన్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు కొట్టుకున్న విషయం తెలిసిందే. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు కూడా హస్తం పార్టీలో చేరారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. బీజేపీ పార్టీ కూడా తమ బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. కానీ అంతర్గత కుమ్ములాటలు, నాయకుల్లో నెలకొన్న విభేదాలతో ఆ పార్టీ కొట్టుమిట్టాడుతున్నది. ఇటీవల జరిగిన మున్సిపాల్టీలకు జరిగిన ఎన్నికల్లో ప్రచారం కోసం పంపిణీ చేసిన నిధులను వ్యయం చేయకుండా చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలు వినిపించాయి. దీనితో ఇప్పటికీ హైదరాబాద్‌లో బీజేపీ నాయకత్వం దృష్టి సారించలేకపోతున్నది.



# హైదరాబాద్ రాయదుర్గం రియల్ సంచలనం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ మరోసారి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం ఐటీ కారిడార్‌కే పరిమితం కాకుండా, గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మారుతున్న భాగ్యనగరం తన రికార్డులను తానే తిరగరాస్తోంది. తాజాగా రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిసరాల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నిర్వహించిన ఈవేలంలో భూముల ధరలు కళ్ళు చెదిరే రీతిలో పలికాయి. సర్వే నంబర్ 83/1లోని పాన్ మక్తా ప్రాంతంలో 6 ఎకరాల 29 గుంటల భూమికి నిర్వహించిన వేలంలో, ఒక ఎకరం ఏకంగా రూ.237 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. గతేడాది అక్టోబర్‌లో ఇదే ప్రాంతంలో ఎకరం రూ.177 కోట్లు పలకగా, కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే ఆ ధరను మించిపోయి రియల్ ఎస్టేట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది.

**రికార్డులు బద్దలు.. అంతర్జాతీయ స్థాయిలో చర్చ**

రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో ఉన్న ఈ భూమి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైనది. ఐటీ కంపెనీలు, హైరైజ్ టవర్లు, మెట్రో కనెక్టివిటీ ఉండటంతో దేశీయ , అంతర్జాతీయ డెవలపర్లు ఈ వేలంలో పోటాపోటీగా పాల్గొన్నారు. టీజీఐఐసీ నిర్ణయించిన కనీస ధర రూ.139 కోట్లు కాగా, వేలం ముగిసే సమయానికి అది దాదాపు రూ.237 కోట్లకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లోని అత్యంత ఖరీదైన ప్రాంతాలతో పోల్చినా, హైదరాబాద్‌లోని ఈ ధర ఇప్పుడు భారతీయ రియల్ ఎస్టేట్ రంగంలోనే టాప్ రేంజ్‌లో ఉంది.

రాయదుర్గం ప్రాంతానికి ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఇక్కడి భూమి బంగారం కంటే ఎక్కువ విలువైనదిగా ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. ప్రస్తుతం వేలం వేసిన 6 ఎకరాల స్థలం హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మరియు ఓఆర్ఆర్ కు అత్యంత సమీపంలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. గతంలో కోకాపేట నియోపోలిస్ లో ఎకరం రూ.100 కోట్లు దాటినప్పుడే అందరూ ఆశ్చర్యపోయారు. కానీ, ఇప్పుడు రాయదుర్గం ఆ రికార్డును ఎక్కడికో తీసుకెళ్లిపోయింది. ఈ ఒక్క వేలం ద్వారా ప్రభుత్వ ఖజానాకు వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ బూమ్ అగ్రరాజ్యం అమెరికాతో పోటీ పడుతోందంటూ చర్చించుకుంటున్నారు. ఏదేమైనా, ఈ రికార్డు ధర హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను మరోస్థాయికి తీసుకెళ్లిందనడంలో సందేహం లేదు.



# డీకే శివకుమార్‌కు లైన్ క్లియర్..?

▶▶ మొదటిపేజీ తరువాయి

వెల్లడించాయి.

"జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను ఐదేండ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేండ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతా'' అని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సిద్ధరామయ్య తన రాజకీయ ప్రస్థానాన్ని, గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. "నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించా. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశా. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదు'' అని సిద్ధరామయ్య వివరించారు. సిద్ధరామయ్య గురువారం సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నట్టు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయమైనట్టు కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై ఎలాంటి అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు

# నిర్మాణాత్మకంగా ముందుకు సాగుదాం

## సమన్వయ సమావేశంలో భారత్-చైనా

వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి తూర్పు లద్దాఖ్‌లో నెలకొన్న పరిస్థితిపై భారత్, చైనాలు బుధవారం బీజింగ్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిపాయి. సరిహద్దులో శాంతి, సామరస్యతలను కాపాడటం ద్వారానే ద్వైపాక్షిక సంబంధాల్లో ముందుకు వెళ్లగలుగుతామని పేర్కొన్నాయి. ఈ చర్చలు నిర్మాణాత్మకంగా, భవిష్యత్తుపై స్పష్టమైన దృక్పథంతో సాగాయని భారత విదేశీ వ్యవహారాల శాఖ గురువారం తెలిపింది. దౌత్య, సైనిక స్థాయిలలో నిరంతర సంప్రదింపులను కొనసాగించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయని తెలిపింది. 2020లో గల్వాన్ లోయలో ఘర్షణలు, ఆ తర్వాత నాలుగేళ్లకు పైగా కొనసాగిన సైనిక ప్రతిష్ఠంభన కారణంగా దెబ్బతిన్న సంబంధాలను పునర్నిర్మించుకోవడానికి భారత్, చైనాలు గత ఏడాది కాలంగా వరుస చర్యలను చేపట్టాయి. తూర్పు లద్దాఖ్‌లో దెప్సాంగ్, దెమ్‌చోక్‌ల నుంచి తమ సైన్యాలను 2024 అక్టోబరులో ఉపసంహరించుకున్నాయి. ఆపైన కొద్ది రోజులకే ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కజాన్‌లో చర్చలు జరిపారు. 2025 ఆగస్టులో షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు మోదీ చైనాలోని తియాంజిన్‌కు వెళ్లారు. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి పలు నిర్ణయాలు తీసుకున్నారు. 2025 ఆగస్టులో జాతీయ భద్రతా సలహాదారుడు అజీత్ డోభాల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ దిల్లీలో ప్రత్యేక చర్చలు జరిపారు. ఇవి సరిహద్దులో శాంతిని కాపాడటానికి తోడ్పడ్డాయి. చైనాలో జరగబోయే తదుపరి ప్రత్యేక ప్రతినిధుల సమావేశానికి పూర్తిస్థాయి సన్నాహాలు చేయాలని తాజా చర్చల్లో రెండు దేశాలు అంగీకరించాయి.

# ప్రధాని కార్యాలయం పర్యవేక్షణలో నీట్ రీటెస్ట్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 21 నిర్వహించే రీటెస్టులో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం పటిష్ఠ చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పేపర్ తయారీ నుంచి ఫలితాల వరకు నిశితంగా పరిశీలించనుంది. దిల్లీలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.జాతీయ మీడియా వివరాల ప్రకారం దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సుమారు 40 నిమిషాల పాటు జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్‌సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి ప్రక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం (PMO) పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. నీట్ రీటెస్ట్కు సంబంధించిన పరిణామాలను ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని వివరించాయి. మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నిర్వహించిన నీట్ యూజీ 2026 పరీక్షను పేపర్ లీక్ అయ్యిందన్న కారణంతో మే 12న రద్దు చేశారు. అనంతరం జూన్ 21న రీటెస్ట్ పెడతామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్లైన్లో నిర్వహిస్తామని తెలిపారు. కాగా, మే 3న దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో మొత్తం 5,400కు పైగా కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష జరిగింది. 22 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ ఎగ్జామ్ రాశారు. అయితే ప్రశ్నాపత్రం లీక్ కారణంగా ఎగ్జామ్ రద్దవ్వడంతో వారు మరోసారి జూన్ 21న పరీక్షను రాయనున్నారు. మరోవైపు నీట్ యూజీ పేపర్ లీక్‌పై రాజకీయ పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి. పరీక్షల నిర్వహణలో కేంద్ర సర్కార్ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వరుసగా జరుగుతున్న నీట్ పేపర్ లీక్‌లకు ప్రభుత్వ ఉదాసీనతే కారణమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వంలో పేపర్ లీక్ మాఫియా వర్ధిల్లుతోందని ఆరోపించారు. కానీ బాధ్యత వహించాల్సిన వారు మాత్రం కూర్చొని వేడుక చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్రం, నీట్ రీటెస్ట్పై దృష్టి సారించింది. ఇదిలా ఉండగా, నీట్ యూజీ అభ్యర్థుల పరీక్ష ఫీజు రీఫండ్ ప్రక్రియకు సంబంధించిన బ్యాంక్ ఖాతా వివరాల సమర్పణ గడువును నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) పొడిగించింది. మే 3న జరిగిన నీట్ యూజీ పరీక్షకు సంబంధించిన అంతరాయాల నేపథ్యంలో ఈ ఫీజు రీఫండ్ ప్రక్రియ నడుస్తోంది. వాస్తవానికి మే 27తో ముగియాల్సిన ఈ గడువును 2026 జూన్ 22 వరకు పొడిగిస్తూ ఎన్టీఏ ప్రకటించింది. అభ్యర్థులు నీట్ 2026 రిజిస్ట్రేషన్ పోర్టల్ ద్వారా తమ బ్యాంక్ ఖాతా వివరాలను సమర్పించి, నేరుగా తమ ఖాతాల్లోకి ఫీజు రీఫండ్ పొందవచ్చు.

# కాంగ్రెస్ కార్మికులను మోసం చేసింది

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**



సింగరేణి, ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ మోసం చేసిందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గురువారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ కు చెందిన సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్థన్, అనుచరులతో కలిసి తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి కవిత సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ కార్మిక శాఖ మంత్రిగా, ఆర్టీసీ చైర్మెన్ గా పని చేసిన జనార్థన్ చేరికతో పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనకు పార్టీలో ప్రాధాన్యమిస్తామని తెలిపారు. మినిమం వేజెస్ ఫిక్స్ చేశామంటూనే కాంగ్రెస్ సర్కార్ కార్మికులకు తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో సబ్బండ తెలంగాణ వర్గాల గతి మార్చే అభివృద్ధి ప్రణాళికను ప్రకటిస్తామని కవిత తెలిపారు. ఆ ప్రణాళిక తెలంగాణలో విప్లవాత్మక మార్పులు తెస్తుందని కవిత చెప్పారు. తమ పార్టీ సమసమాజ స్థాపన కోసం ఏర్పడిందని...తాము కచ్చితంగా తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా మారుతామన్నారు. జనం బాట కార్యక్రమంలో ప్రస్తావించిన సమస్యల్లో 25 సమస్యలకు పరిష్కారం లభించిదని తెలిపారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పై మనం ఎన్నో ముఖ్యమంత్రి సమీక్షించి, ఉద్యమాలు చేయకండి మేము పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. నల్లగొండలో 35 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న బ్రిడ్జి పనులను జనంబాటలో ప్రస్తావిస్తే పనులను ప్రారంభించారని కవిత గుర్తు చేశారు. ఆరేళ్ల క్రితం మల్కాజ్ గిరి ఎంపీగా రేవంత్ రెడ్డి, అప్పటి సీఎం కు కార్మికులకు మినిమమ్ వేజేస్ రూ.20 వేలు ఉండాలని కోరారని కవిత గుర్తుచేశారు. ముఖ్యమంత్రిగా తానే ఆ క్యాటగిరీ కార్మికులకు రూ.16 వేల వేతనం ఇస్తామని గొప్పగా చెప్పి నయవంచనకు గురి చేశారని విమర్శించారు. సింగరేణిలో ఒక్క రూపాయితో అయ్యే పనులకు రూ.10 ఖర్చు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. జనార్థన్ సహకారంతో సింగరేణి కార్మికుల కోసం మరింత గట్టిగా పోరాడుతామని తెలిపారు. ఆర్టీసీ డ్రైవ్ రాజు గౌడ్ బలిదానం చేసుకునేంత వరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీ ఊసెత్తలేదని కాంగ్రెస్ సర్కార్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వద్దు కొనాలని కోరిన ఆర్టీసీ డ్రైవర్ ను ఉద్యోగం నుంచి తీసేసి పోరాడితే వెనక్కి తగ్గారని తెలిపారు. జనార్థన్ సహకారంతో ఆర్టీసీ కార్మికుల కోసం కూడా పోరాటం చేస్తామని తెలిపారు.

**ఎన్టీఆర్, కేసీఆర్ కన్న ఉన్నతంగా కవిత**

ఎన్టీఆర్, కేసీఆర్ కన్నా కల్వకుంట్ల కవిత ఉన్నతంగా ఆలోచించారని బోడ జనార్థన్ అన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో ఎన్టీఆర్, నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కేసీఆర్ వస్తే కవిత పాంచజన్యం పేరుతో ఐదు కీలకాంశాలతో ముందుకొస్తున్నారని తెలిపారు. మహిళ ముఖ్యమంత్రి అయితే తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక నుంచి కాంగ్రెస్ పై పెద్ద ఎత్తున పోరాటం చేస్తాననీ, టీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో నరకప్రాయంగా ప్రయాణం

- ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- సింగిల్ రోడ్డుపైనే భారీ వాహనాలు... గంటల తరబడి ట్రాఫిక్ జామ్
- దుమ్ము ధూళితో ఊపిరాడక కొట్టుమిట్టాడుతున్న కాలనీవాసులు




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కనీస రోడ్డు సదుపాయం లేక వాహనదారులు, స్థానిక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. జిల్లా కేంద్రంగా మారినా, కనీసం ఒక సరైన బైపాస్ రోడ్డు కూడా నిర్మించలేకపోవడం (ఆర్ & బి ) అధికారుల చేతకా నితనానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది.

**వన్‌వే రోడ్డు.. వందల సమస్యలు!**

పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి భద్రాచలం, మణుగూరు, ఇల్లందు వైపు వెళ్లేందుకు ఉన్నటువంటి ఏకైక సింగిల్ వన్‌వే రోడ్డు గుండానే నిత్యం వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇదే మార్గంలో రామాంజనేయ కాలనీ, బోడగుట్ట, శేషగిరి నగర్, శ్రీనివాస్ కాలనీ, హేమచంద్రపురం మీదుగా కోర్టు రోడ్డు వెళ్లే దారిలో రైల్వే గేటు ఉండటం ప్రయాణికులకు శాపంగా మారింది. రైల్వే గేటు పడిన ప్రతిసారీ కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి, గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

**'మామా' అనిపిస్తున్న తాత్కాలిక పనులు!**

కనీసం ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించాల్సింది పోయి.. ఉన్న రోడ్డును అడ్డదిడ్డంగా తవ్వి, కంకర పోసి, కాస్త నీళ్లు చల్లి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఈ 'మామా.. అనిపించే' తాత్కాలిక పనుల వల్ల సమస్య తీరకపోగా, మరింత జటిలంగా మారుతోంది.

**బెటాలియన్ రోడ్డులో నరకం!**

జిల్లా హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన కీలకమైన బెటాలియన్ ఆఫీస్ హేమచంద్రపురం రోడ్డులోనే ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రోడ్డులో కనీస ప్రయాణ సౌకర్యం లేకపోవడం గమనార్హం. భారీ వాహనాలు వెళ్తుంటే లేస్తున్న దుమ్ము ధూళి వల్ల అసలు రోడ్డు ఎక్కడుందో, ఎదురుగా ఏ వాహనం వస్తుందో కూడా కనిపించని ప్రమాదకర పరిస్థితి నెలకొంది.

**సాయంత్రం అయితే 'చీకటమయం'.. ఇళ్ల నిండా దుమ్మే!**

సాయంత్రం 5 గంటలు దాటిందంటే చాలు.. ఈ మార్గంలో నరకం కళ్లముందు కనిపిస్తుంది. భారీ వాహనాల తాకిడికి, దుమ్ము ధూళితో రోడ్డు మొత్తం చీకటమయంగా మారిపోతోంది. ముఖ్యంగా శేషగిరి నగర్ లోని ఇళ్లన్నీ పూర్తిగా దుమ్ము కొట్టుకుపోయాయి. కంటిమీద కునుకు లేకుండా, కనీసం శ్వాస తీసుకోలేక స్థానికులు అల్లాడిపోతున్నారు.

### అధికారులారా.. ఇకనైనా కళ్లు తెరవండి!

తమ సమస్యలపై స్థానిక కాలనీవాసులు, వాహనదారులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆర్ అండ్ బి అధికారులు, జిల్లా యంత్రాంగం కన్నెత్తి కూడా చూడటం లేదని తెలంగాణ చౌరస్తా ప్రతినిధితో ప్రజలు తమ ఆవేదనను వెళ్లగక్కారు. అధికారులు చెవిటోడి ముందు శంఖం ఊదినట్లు వ్యవహరిస్తున్నారని మండి పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, శాశ్వత బైపాస్ రోడ్డు నిర్మించి, హేమచంద్రపురం, శేషగిరి నగర్ రోడ్లను వెంటనే బాగు చేయాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు



# ఖబర్దార్ సంపత్ నాయక్.. నోరు అదుపులో పెట్టుకో!



తెలంగాణ గడ్డపై నిలబడి, తెలంగాణ ఉద్యమ గొంతుకపై నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోవడానికి ఇక్కడెవరూ చేతగాని వాళ్ళు లేరు. తెలంగాణ కోసం దశాబ్దాలుగా గొంతుకై నిలిచిన పెద్దాయన పాశం యాదగిరి గారిని ఉద్దేశించి నువ్వు చేసిన 'అరేయ్' అనే సంస్కారహీనమైన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలంగాణ సమాజం దీన్ని ముక్తకంఠంతో వ్యతిరేకిస్తోంది.

పాశం యాదగిరి అంటే ఒక చరిత్ర.. నీ చరిత్ర ఏంటి? పాశం యాదగిరి అంటే 1969 తెలంగాణ ఉద్యమం నుండి మలిదశ ఉద్యమం వరకు, తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని గుండెల్లో మోస్తూ, కలం పట్టి గర్జించిన పత్రికా రంగ సవ్యసాచి.

తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ఢిల్లీ పీఠాలకు సైతం బలంగా వినిపించిన మేధావి.

నిన్న కాక మొన్న రాజకీయాల్లోకి వచ్చి, పక్క రాష్ట్ర పార్టీ జెండా మోస్తున్న సంపత్ నాయక్.. తెలంగాణ కోసం నువ్వు చేసిన త్యాగమేంటి? నీ పోరాట చరిత్ర ఏంటి?

**పక్క రాష్ట్రాల అజెండాలు ఇక్కడ సాగవు!**

ఆంధ్రప్రదేశ్ కేంద్రీకృతంగా నడిచే ఒక పార్టీకి ఇక్కడ కొమ్ముకాస్తూ, తెలంగాణ ఉద్యమకారులపై నోరేసుకుని పడితే ఊరుకునేది లేదు.

పార్టీలు మారడం, పొత్తుల కోసం పాకులాడడం మీ నైజం కావచ్చు. కానీ సిద్ధాంతం కోసం, తెలంగాణ ప్రయోజనాల కోసం నిలబడడం పాశం యాదగిరి గారి నైజం.

రాజకీయ విమర్శలు ఉంటే ప్రజాస్వామ్యబద్ధంగా చెయ్, అంతే కానీ "అరేయ్ తరేయ్" అంటూ సంస్కారం లేని వీధి రౌడీ భాష మాట్లాడితే తెలంగాణ సమాజం నీకు తగిన బుద్ధి చెబుతుంది.

సంపత్ నాయక్.. ఇప్పటికైనా నీ అహంకారాన్ని, సంస్కారహీనమైన భాషను పక్కన పెట్టి, పాశం యాదగిరి గారికి, తెలంగాణ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేదంటే తెలంగాణ వాదుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

**తెలంగాణ ఉద్యమకారుల జోలికొస్తే ఖబడ్దార్!**

**జై తెలంగాణ! జై జై తెలంగాణ!**

**- దొడ్డి చంద్రం,**
**దొడ్డి కొమురయ్య మనవడు, కడవెండి**

# రైతులు ఆందోళన చెందవద్దు

- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం
- జిల్లా కలెక్టర్ అంకిత్
- మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమైతే కఠిన చర్యలు
- రవాణా సమస్యల పరిష్కారానికి శాఖల సమన్వయం
- రైతులకు నష్టం జరగకుండా ప్రత్యేక అలర్ట్ మెకానిజం




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

అకాల వర్షాల నేపథ్యంలో జిల్లాలోని రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ, ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

**రవాణా వేగవంతం – ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌ల నియామకం**

ధాన్యం రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా రెవెన్యూ, రవాణా శాఖల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను వినియోగిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

**ప్రతి రైస్ మిల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను నియమించాం.**

లోడింగ్, అన్‌లోడింగ్ వేగంగా జరిగేందుకు అదనపు హమాలీలను ఏర్పాటు చేశాం. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించినా లేదా ఆలస్యం చేసినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

**తడిసిన ధాన్యానికి ముందస్తు ప్రణాళిక**

"ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక అలర్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసింది. వర్షానికి ధాన్యం తడిసినా రైతులు అధైర్యపడొద్దు.తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి, వాటిని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టాం. రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వం."అంకిత్, జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు - క్షేత్రస్థాయి పర్యవేక్షణ రెవెన్యూ, సివిల్ సప్లై, రవాణా శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు ప్రత్యేక కోఆర్డినేటర్లు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన సూచించారు



# రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా :**

మండల పరిధిలోని పెదనెమిల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరాటి రామస్వామి(65) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రామస్వామి తన సొంత పనుల నిమిత్తం ఉదయం మండల కేంద్రానికి వచ్చి తన పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్లడానికి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉండి టీఎస్ 29 టి ఏ 3275 నెంబరు గల పల్లె వెలుగు బస్సు సూర్యాపేట నుండి మహబూబాబాద్ వెళుతున్న బస్సురాగానే ఎక్కుతున్న సమయంలో బస్సు డ్రైవర్ అతను పూర్తిగా బస్సు ఎక్కక ముందే నిర్లక్ష్యంగా బస్సును ముందుకు కదిలించడంతో ప్రమాదవశాత్తు కిందపడగా బస్సు వెనుక టైరు అతని పైకి ఎక్కి వెళ్లడంతో పొట్ట భాగంలో కనిపించని గాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ చూసి రామస్వామి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.బస్సు డ్రైవర్ వెలుగుపల్లి గ్రామానికి చెందిన కుర్రపిడతల మహేష్ గా గుర్తించారు. మృతుడి భార్య మరాటి అనసూర్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.



# సంక్షేమ పథకాల ఆద్యుడు ఎన్టీఆర్

- తలారి శ్రీనివాసరావు
- ఓయూలో ఎన్టీఆర్ 103వ పుట్టినరోజు వేడుకలు.

**సికింద్రాబాద్,తెలంగాణ చౌరస్తా:**

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట గురువారం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ, పుట్టినరోజు సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట "సిబిఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్" స్కూల్ ఆఫ్ సిబిఎన్ " ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఎన్టీఆర్ సినీ రాజకీయ రంగాల్లో సంచలనం సృష్టించిన వ్యక్తి అని, అయినకు భారత రత్న జాప్యం తగదన్నారు.మహిళ సాధికారత కిలో 2 రూపాయల బియ్యం, మద్యపాన నిషేధం లాంటి పథకాలు అమలు చేసిన వ్యక్తి అన్నారు.ఈ కార్యక్రమంలో తలారి నాగరాజు, నరేందర్, సైదులు, రాములు, తేజ, విశ్వం, రాము,రాజు ,గిరి,వివేక్,తేజ, లక్ష్మణ్, రాహుల్ , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# బక్రీద్ ముబారక్..

- ఎమ్మెల్యే జీఎంఆర్ ను కలిసిన ముస్లిం యువకులు
- ముస్లింలకు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి శుభాకాంక్షలు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా :**

బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) సందర్భంగా ముస్లిం యువకులు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిశారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని గురువారం సాయంత్రం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయతను చాటుకున్నారు. బీఆర్ఎస్ యువ నాయకుడు షకీల్ (లడ్డు) అధ్వర్యంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని మహరుమతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముస్లిం యువకులను బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ సయ్యద్ సులైమాన్, అలీ బాబా, అక్రమ్ పాషా, ఆమేర్, ఫసి, ఖాదర్, గుండమెళ్ళ రాజు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.



# ఇరిగేషన్ శాఖ నిర్లక్ష్యం కార్పొరేషన్ ఏకపక్ష అరాచకం

- అధికారుల బరితెగింపు
- చెరువులను మింగేస్తున్న మురికికూపం..
- ఎదురుగడ్డ ప్రజల గుండెల్లో గుబులు
- పంచాయతీని తొక్కిపెట్టి మురికినీటి మళ్లింపు
- నిబంధనలు గాల్లోకి
- రోగాల బారిన పడితే బాధ్యులెవరు?









**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**

ప్రజాధనంతో జీతాలు తింటూ, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు తమ కండ్లకు గంతలు కట్టుకున్నారు. చెరువులను రక్షించాల్సిన ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ చేతకానితనం, కార్పొరేషన్ అధికారుల బాధ్యతారాహిత్యం వెరసి.. ఎదురుగడ్డ గ్రామపంచాయతీ నడిబొడ్డున ఉన్న ఊరి చెరువును మురుగుకూపంగా మారుస్తున్నారు. కార్పొరేషన్ 30వ డివిజన్‌కు సంబంధించిన సైడ్ డ్రైనేజీల కంపు మురికి నీళ్లను, ఎలాంటి అనుమతులు లేకుండా, కనీస నిబంధనలను బూడిదలో పోసి ఎదురుగడ్డ చెరువులోకి అడ్డగోలుగా మళ్లిస్తున్నారు. అధికారుల ఈ బరితెగింపుపై స్థానిక ప్రజలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

**పంచాయతీ అస్తిత్వాన్ని తొక్కేస్తారా?**

స్థానిక స్వపరిపాలనకు అర్థం లేకుండా చేస్తూ.. ఎదురుగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్‌కు గానీ, సెక్రటరీకి గానీ కనీస సమాచారం ఇవ్వకుండా మున్సిపాలిటీ సిబ్బంది ఈ అరాచకానికి ఒడిగట్టారు. అసలు ఒక పంచాయతీ పరిధిలోకి కార్పొరేషన్ డ్రైనేజీ నీటిని మళ్లించడానికి వీరికి పర్మిషన్ ఇచ్చింది ఎవరు? చట్టాలను, నిబంధనలను మున్సిపల్ అధికారులు తమ కాళ్ల కింద వేసి తొక్కుతుంటే.. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎక్కడ పడుకుంది? అసలు ఈ శాఖలు బతికే ఉన్నాయా? అంటూ గ్రామస్తులు తీవ్ర పదజాలంతో ధ్వజమెత్తుతున్నారు.


"ఇది మున్సిపాలిటీ అధికారుల అధికార మదం. గ్రామ పంచాయతీని, ఇక్కడి ప్రజల ప్రాణాలను వారు చులకనగా చూస్తున్నారు. ఈ అక్రమ పనులను ఊరుకునేది లేదు."ఎదురుగడ్డ గ్రామ ప్రజలు

**వర్షా కాలం వస్తోంది.. రోగాలు తెస్తారా?:**

రాబోయేది వర్షాకాలం. ఈ కంపు మురికినీరంతా ఊరి మధ్యలో ఉన్న చెరువులో చేరితే.. ఆ అంటు వ్యాధుల దుర్వాసనతో, దోమల కాటుతో గ్రామ ప్రజల ప్రాణాలు గాల్లో కలవాల్సిందేనా? డెంగ్యూ, మలేరియా వంటి మహమ్మారులు చుట్టుముడితే అధికారుల ఇండ్లు ఊడుస్తారా? అని గ్రామ సిబ్బంది, ప్రజలు నిలదీస్తున్నారు. ఈ ఘోరంపై ఇరిగేషన్ అధికారులను అడిగితే.. "మేము మున్సిపాలిటీతో మాట్లాడుతున్నాం" అంటూ చేతులు దులుపుకునే సోమరిపోతు సమాధానాలు చెబుతున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో పనులను ఆపే దమ్ము చూపించడం లేదు. ఊరుకునేది లేదు..

### కలెక్టరేట్ బద్దలు కొడతాం:

అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఎదురుగడ్డ గ్రామ ప్రజలు యుద్ధానికి సై అంటున్నారు. ఈ మురికినీటి మళ్లింపును తక్షణమే ఆపకపోతే.. మున్సిపాలిటీ ఆఫీస్‌ను స్తంభింపజేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారుల తీరుపై కలెక్టరేట్ ముట్టడికి వెనుకాడబోమని, పిటిషన్లతో పాటు ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని గ్రామస్తులు అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కళ్ళు తెరిచి ఈ అక్రమ పనులను ఆపకపోతే.. ఉద్రిక్త పరిస్థితులకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది. తెలంగాణ చౌరస్తా ప్రతినిధితో ఎదురుగడ్డ గ్రామపంచాయతీ ప్రజలు








# కేరళ మాజీ సీఎంపై ఈడి కక్షపూరిత దాడులు ఆపాలి

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా**

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు కేరళ మాజీ ముఖ్యమంత్రి ఇంటిపై కక్షపూరితంగా ఈడి దాడులు నిర్వహించడాన్ని నిరసిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కేంద్ర సంస్థలను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రతిపక్షాలపై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి,గ్రామ కార్యదర్శి బొజ్జ శ్రీను, శాఖ కార్యదర్శి గజ్జల శ్రీనివాస్ రెడ్డి,ఇరుగు రమేష్,ఎర్ర ఉప్పల్ రెడ్డి, బాణాల విజయ్ రెడ్డి, కుసు బాలకృష్ణ, పులుసు లింగయ్య, మున్న మహేష్,జటంగి లింగయ్య,కట్ట లక్ష్మారెడ్డి,కూసు నాగరాజు,కూసు రామచంద్రు, జగన్ రెడ్డి, ఉప్పుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పరిశుభ్రత కోసం

- స్వయంగా రంగంలోకి దిగిన ప్రజాప్రతినిధి భర్త

**కమాన్ పూర్,తెలంగాణ చౌరస్తా:**




గ్రామ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతే ధ్యేయంగా పెంచికల్ పేట్ గ్రామ సర్పంచ్ భర్త పల్లె నారాయణ గురువారం తన నిబద్ధతను చాటుకున్నారు.పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పెంచికల్ పేట్ గ్రామ పంచాయతీలో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించాల్సిన ట్రాక్టర్ డ్రైవర్ అనివార్య కారణాల వల్ల విధులకు హాజరు కాలేదు.దీనితో గ్రామంలో చెత్త సేకరణ,పారిశుద్ధ్య కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడే పరిస్థితి తలెత్తింది. గ్రామంలో ఒకరోజు పనులు ఆగినా పరిశుభ్రత దెబ్బతింటుందని భావించిన పల్లె నారాయణ కాలయాపన చేయకుండా స్వయంగా రంగంలోకి దిగారు.ఆయనే స్వయంగా ట్రాక్టర్ నడిపుతు గ్రామంలోని వీధుల వెంబడి తిరుగుతూ చెత్త తరలింపు ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగేలా చూశారు. ప్రజా సమస్యల పరిష్కారంలోనే కాకుండా గ్రామ అభివృద్ధి, పరిశుభ్రతపై ఆయన కనబరిచిన ఈ ప్రత్యేక శ్రద్ధ స్థానికులను ఎంతగానో ఆకట్టుకుంది. పదవులు,హోదాల కంటే గ్రామ సేవ ముఖ్యమని నిరూపించిన పల్లె నారాయణ నిర్ణయాన్ని గ్రామస్తులు ఆదర్శనీయమంటూ అభినందించారు.

# డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు వీలుగా ప్రభుత్వాలు అర్హులకు ఇళ్లను కేటాయిస్తున్నాయి. బీఆర్ఎస్ హయంలో 'డబుల్ బెడ్రూం' కేటాయింపులు చేయగా.. కాంగ్రెస్ 'ఇందిరమ్మ ఇళ్లు' పేరుతో పేదలకు పక్కా గృహాలు నిర్మిస్తోంది. బుధవారం గ్రేటర్ హైదరాబాద్లో ఇళ్ల కోసం స్థలాల పరిశీలన అనంతరం మంత్రులు పొన్నం, అజారుద్దీన్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డితో కలిసి రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.

ఈ సమీక్ష అనంతరం గత ప్రభుత్వ చర్యలపై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్కు పొంగులేటి సవాల్ విసిరారు. హైదరాబాద్ నగరంలో గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో నిర్మాణం చేపట్టిన ఇళ్లకంటే రానున్న రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికంగా ఇళ్లు నిర్మాణం చేయకపోతే తాను వచ్చే శాసనసభ ఎన్నికల్లో పోటీచేయనని.. అదే కాంగ్రెస్ సర్కార్ ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే కేటీఆర్ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండేందుకు సిద్ధమా..? అంటూ పొంగులేటి సవాల్ చేశారు. తాజాగా ఈ సవాల్ పై కేటీఆర్ ఘాటుగా స్పందించారు.





తాము గృహనిర్మాణ యజ్ఞం చేసిన నిర్మాతలం అయితే.. కాంగ్రెస్ నేతలు గృహ మేధ యాగం చేస్తున్న విధ్వంసకులు అంటూ కేటీఆర్ విమర్శలు చేశారు. ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ తమదే అన్న కేటీఆర్.. సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటని వ్యాఖ్యానించారు. తాము తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని.. పేదల సొంతింటి కలను సాకారం చేశామని తెలిపారు. తమ హయాంలో డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించామని కేటీఆర్ అన్నారు. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని సవాల్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకొనే దమ్ముందా అంటూ ప్రశ్నించారు. శపథం చేయడం కాదని.. చేతనైతే చేసి చూపించాలని సవాల్ చేశారు. పౌరుషం ఉంటే 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. గుమ్మం తొక్కి ఓట్లు అడుగుతామన్న సవాల్కు మంత్రి పొంగులేటి కట్టుబడి ఉండాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరంలో లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించిన ఘనత తమదని కేటీఆర్ అన్నారు. రూ.70 వేలతో అగ్గిపెట్టెలాంటి ఇళ్లు కట్టలేదన్న కేటీఆర్ తమ హయాంలో నిర్మించిన ఒక్కో ఇళ్లు ఏడు ఇందిరమ్మ ఇళ్లతో సమానమంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో దేశానికే నమూనాగా అందమైన పొదరిల్లను నిర్మించి చూపించామన్నారు.

ఇటుకలు పేర్చి ఇళ్లు కట్టింది తామైతే.. పేదల గృహాలపైకి బుల్డోజర్లు ఎక్కించి కూలగొడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. గత రెండు సంవత్సరాల్లో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని.. కూల్చిన ఇళ్లు ఎన్ని.. అని ప్రశ్నించిన కేటీఆర్ ఆ వివరాలతో శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం ఉందా అంటూ ప్రశ్నించారు. దీపావళి బాంబులు పేలుస్తామంటూ.. తుస్సుమనిపించిన "మినిస్టర్ బాంబులేటి" అంటూ ఘాటుగా విమర్శించారు. ఢిల్లీకి లొంగిపోయి కేసుల నుంచి తప్పించుకోవడం తమకు తెలియదని, అడ్డదారుల్లో వేలకోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకునే అవినీతి కిటుకూ తమకు తెలియదంటూ తీవ్ర విమర్శలు చేశారు.

కాంగ్రెస్ నేతలు ఎన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా.. వారిని వదిలిపెట్టబోమని కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్ల ఎగవేత ద్రోహాన్ని ప్రశ్నిస్తునే ఉంటామన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# సమగ్ర సంక్షేమ కార్డు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎవరికి ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా ఈ కార్డులు ఉండాలన్నారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రేవంత్ రెడ్డి సూచించారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలనూ సేకరించాలన్నారు.రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు'ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలన్నారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.

సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ,



ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఎస్ఈఈఈపీసీ సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు.కేరళం నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం స్పష్టం చేశారు.ఈ కార్డులపై మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కె. రామకృష్ణారావు సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు

# భారతీయ స్వదేశీ బియ్యం రకాలు

## రుచులు, సువాసనలు, పోషక విలువలు



### పశ్చిమ బెంగాల్, మణిపూర్..

పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోబిందోభోగ్ బియ్యం అక్కడి సంప్రదాయాలతో ముడిపడి ఉంది. చిన్న తెల్లని గింజలతో ఉండే ఈ బియ్యం వెన్నలాంటి మృదువైన వాసనను ఇస్తుంది. ఖిచిడి, పాయేష్, పులావ్ వంటి బెంగాలీ వంటకాల్లో దీన్ని ప్రధానంగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా దుర్గాపూజ సమయంలో ఈ బియ్యం లేకుండా సంప్రదాయ వంటలు పూర్తి కావని భావిస్తారు. 2017లో ఈ బియ్యానికి జీఐ గుర్తింపు లభించింది. అలాగే మణిపూర్‌కు చెందిన చక్-హావో అనే నల్ల బియ్యం దేశంలో అత్యంత ప్రత్యేకమైన రకాలలో ఒకటి. వండకముందు నల్లగా కనిపించే గింజలు ఉడికిన తర్వాత గాఢ ఊదా రంగులోకి మారుతాయి. కొద్దిగా తీయని, నట్స్ రుచిని కలిగిన ఈ బియ్యం పురాతన కాలంలో రాజవంశీయులకే పరిమితమై ఉండేదని చెబుతారు. చక్-హావో ఖీర్ ఈ బియ్యంతో చేసే ప్రసిద్ధ వంటకం. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటంతో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేవారు కూడా దీనిని ఇష్టపడుతున్నారు.

### తమిళనాడు, ఉత్తర ప్రదేశ్..

తమిళనాడులో ప్రసిద్ధి చెందిన మప్పిళ్లై సంబా ఎర్ర బియ్యం వెనుక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. వరుడి బియ్యం అని అర్థమయ్యే ఈ రకం శక్తి, స్టామినా పెంచుతుందని నమ్మకం. గట్టిగా ఉండే ఈ బియ్యాన్ని దోశలు, ఇడ్లీలు, గంజి వంటి సంప్రదాయ వంటల్లో ఉపయోగిస్తారు. ఒకప్పుడు కనుమరుగవుతున్న ఈ రకం ఇప్పుడు ఆరోగ్యకరమైన ధాన్యాలపై పెరుగుతున్న ఆసక్తితో మళ్లీ ప్రాచుర్యం పొందుతోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాలానమక్ బియ్యానికి బౌద్ధకాలం నాటి చరిత్ర ఉందని చెబుతారు. దీని పేరుకు కారణం గింజలపై ఉండే నలుపు రంగు పొట్టు. ఉడికినప్పుడు పాప్‌కార్న్ వాసనలా ప్రత్యేకమైన పరిమళం వస్తుంది. కొద్దిగా తీపి రుచితో ఉండే ఈ బియ్యం పులావ్ వంటి వంటకాలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. సాగు తగ్గిపోవడంతో అంతరించిపోతున్న ఈ రకానికి ప్రభుత్వం జీఐ ట్యాగ్ ఇచ్చి ప్రోత్సాహం కల్పించింది.

భారతీయుల ఆహార సంస్కృతిలో బియ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. బియ్యంతో వండిన అన్నాన్ని చాలా మంది ఆహారంగా తీసుకుంటూ ఉంటారు. అయితే ప్రస్తుతం ఎక్కువమంది బాస్మతి లేదా పాలిష్ చేసిన తెల్ల బియ్యాన్నే ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. కానీ శతాబ్దాల క్రితమే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేల సంఖ్యలో స్వదేశీ బియ్యం రకాలు సాగు చేయబడేవి. వీటిలో కొన్ని సహజ సువాసనతో, మరికొన్ని ఎరుపు లేదా నలుపు రంగులతో ప్రత్యేకతను సంపాదించాయి. రుచులు, వాసనలు, పోషక విలువలు ఒక్కో రకానికి ఒక్కో విధంగా ఉండటం వీటి ప్రత్యేకత. వివిధ రాష్ట్రాల్లో పండే స్వదేశీ బియ్యం రకాల గురించి నిపుణులు వివరిస్తున్నారు. అస్సాంలో ప్రసిద్ధి చెందిన జోహా బియ్యం చిన్నగా, గుండ్రంగా ఉండే గింజలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇది ఉడుకుతున్నప్పుడు ఇల్లంతా తీయని పూల వాసనలా పరిమళిస్తుంది. వండిన తర్వాత మెత్తగా ఉండే ఈ బియ్యం అతుక్కుపోకుండా ఉంటుంది. పులావ్, పండుగల భోజనాలు, ఖీర్ వంటి తీపి వంటకాల్లో దీనిని విరివిగా ఉపయోగిస్తారు. అస్సాంలో శతాబ్దాలుగా సాగు చేస్తున్న ఈ బియ్యానికి జీఐ ట్యాగ్ కూడా లభించింది.

**కేరళ, మహారాష్ట్ర..**

కేరళలోని నజావర బియ్యం ఆయుర్వేదంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఎర్రని గింజలతో ఉండే ఈ బియ్యం సాధారణ బియ్యంతో పోలిస్తే కొద్దిగా చేదు, మట్టి వాసన కలిగిన రుచిని ఇస్తుంది. ఆరోగ్య ప్రయోజనాల కోసం దీన్ని ఆయుర్వేద గంజి, ప్రత్యేక ఆహారాల్లో ఉపయోగిస్తారు. మధుమేహం, ఎముకల బలహీనత వంటి సమస్యల్లో ఇది ఉపయోగకరమని భావిస్తారు. మహారాష్ట్రకు చెందిన అంబెమోహర్ బియ్యం మామిడి పూల పరిమళాన్ని సూచిస్తుంది. వండినప్పుడు వచ్చే సువాసన మామిడి పూల వాసనను తలపిస్తుంది. మసాలే భాత్ వంటి మహారాష్ట్ర సంప్రదాయ వంటల్లో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. జీఐ ట్యాగ్ పొందిన ఈ బియ్యం అక్కడి ప్రజలకు ఎంతో ప్రీతిపాత్రమైనది. తమిళనాడులో ప్రసిద్ధి చెందిన కావుని బియ్యం కూడా ఒకప్పుడు రాజ కుటుంబాలకు మాత్రమే పరిమితమై ఉండేదని చెబుతారు. నల్లని రంగు, తీయని నట్స్ రుచి, నమిలే గుణం దీనికి ప్రత్యేకత. బెల్లం, కొబ్బరితో చేసే కావుని అరిసి స్వీట్ అనే తీపి వంటకం ఎంతో ప్రసిద్ధి చెందింది. సాధారణ బియ్యంలా తేలికగా కాకుండా గట్టిగా ఉండే ఈ బియ్యం ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. దేశంలోని ఈ స్వదేశీ బియ్యం రకాలు కేవలం ఆహారం మాత్రమే కాదు, ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆరోగ్య జ్ఞానానికి కూడా ప్రతీకలుగా నిలుస్తున్నాయి.